


# నవ్వే కన్నీళ్ళు

**కె.** కిరణ్ కుమార్ (సెక్షన్ బి, ఎనిమిదవ తరగతి)కి వచ్చినంత కష్టం ఈ మధ్య కాలంలో ప్రపంచంలో ఎవరికీ వచ్చి వుండదు. సాయంత్రమవగానే రోడ్డు మధ్యలో ఆడే క్రికెట్ ఆటకూడా ఉత్సాహం కలిగించలేదు. ఆ రోజంతా దిగులుగానే ఉన్నాడు. స్కూల్లో మాష్టారుచెప్పే పాఠం చెవి కెక్కలేదు.

అసలీకష్టమంతా పక్కింటి గుర్నామ్‌సింగ్ వల్లనే వచ్చింది. జరిగిందేమిటంటే కిరణ్

కుమార్ తండ్రి పదిరోజులు క్రితం వ్యాపారనిమిత్తం అమృత్‌సర్ వెళ్ళి ఫ్యాక్టరీకి కావలసిన మిషన్లు కొనుక్కొచ్చాడు. వెళ్ళే ముందు గుర్నామ్‌సింగ్ ఆయన్ని కలుసుకుని, "భయ్యా! స్వర్ణ దేవాలయం పక్క సందులో కుడివైపు బజార్లో 'పవిత్ర సింధూర్' అని దొరుకుతుంది. అదొక్క ప్యాకెట్ తీసుకురా" అని కోరాడు. తండ్రి ఆ విధంగానే వస్తూ వస్తూ అమృత్‌సర్ నుంచి ఒక ప్యాకెట్ కుంకుమ తీసుకొచిచ కొడుక్కిచ్చి పక్కింట్లో ఇచ్చి రమ్మన్నాడు.

కిరణ్‌కుమార్ పాలిటశాపంలా, అది క్రికెట్ ఆడే టైమ్, క్రికెట్ కన్నా ముఖ్యమైనది మరొకటి వంఉడదు కదా! ఆ తొందర్లో కిరణ్ దాన్ని ఎక్కడో పెట్టి ఆటకి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి జ్ఞాపకం వచ్చి ఇద్దామనుకుంటే, దాన్ని ఎక్కడపెట్టాడో మర్చిపోయాడు. అప్పట్నుంచీ మొదలైంది దిగులు. చదువు ఎక్కదు నిద్ర పట్టదు.

తండ్రి ప్రొద్దున్నే ఫ్యాక్టరీకి వెళ్ళిపోయాడు కాబట్టి ఈ విషయం బయటకు రాలేదు కానీ, రేపు ఆదివారం ఇది బయటపడక తప్పదు. ప్రతీ ఆదివారమూ తన తండ్రి, గుర్నామ్‌సింగూ తప్పనిసరిగా కలిసి కూరగాయల మార్కెట్‌కి వెళ్ళే సందర్భంలో "కుంకుమ అందిదా?" అని ఈయన ఆయన్ని అడుగుతాడు ఆయన లేదంటాడు. దాని ఫలితం తన వీపు మీద పడుతుంది. గుర్మామ్‌సింగ్ దైభక్తి, తన తండ్రి కోపిష్టి తత్వమూ కిరణ్‌కుమార్‌కి బాగా ఎరుకే, ఇంత అల్ప ప్రాణికి ఎంత పెద్ద సమస్య?

ఆ రాత్రి ఎలానో గడిచింది. నిద్రలో తండ్రి తన వీపు కుంకుమ వర్ణం తేలేట్టు కొడుతున్నట్టు కల కూడా వచ్చింది ఒక ఆలోచన. అది రాగానే కిరణ్ మొహం విప్పారింది. రీడర్స్ డైజెస్ట్ వాళ్ళ దగ్గిర్నుంచి తండ్రికి అప్పుడప్పుడు అలాటి వుత్తరాలు రావటం చూసాడు.

స్నేహపూరితంగా ఒక తెలియని మనిషికి ఆదరంతో వ్రాస్తారు వాళ్ళు. ఒక కార్డు తీసుకుని వెంటనే వుత్తరం వ్రాసేడు.

డియర్ ఫ్రెండ్,

నువ్వెవరో నాకు తెలీదు. నువ్వూ నాలాగే ఎనిమిదో తరగతి కదా. అందుకని వ్రాస్తున్నాను. నా పేరు కిరణ్‌కుమార్. మా నాన్నగారు మీ వూరినుంచి వస్తూ వస్తూ మా పక్కింటాయనకోసం పవిత్ర సింధూర్ తెచ్చారు. నేను క్రికెట్ ఆటకి వెళ్ళే తొందరలో దాన్ని ఎక్కడో పెట్టాను. నేను వెంటనే దాన్ని మా పక్కింటాయనకి ఇవ్వకపోతే ఆదివారం మా నాన్న వచ్చాక నన్ను తిడతారు. మిత్రమా ఒక్క సింధూర్ ప్యాకెట్ నాకు వెంటనే పోస్టు పంపగలవా? అది స్వర్ణ దేవాలయం పక్క సందులో దొరుకుతుందట. నా అడ్రసు క్రింద వ్రాస్తున్నాను.

ఇట్లు -

కిరణ్ కుమార్

కార్డుమీద "సింగ్., రోల్ నెం. 1, ఎనిమిదో తరగతి, మున్సిపల్ హైస్కూల్, టెంపుల్ రోడ్, అమృత్‌సర్" అని వ్రాసి పోస్టు చేశాడు. టెంపుల్ రోడ్‌లో స్కూల్ వుందని ఎప్పుడో పక్కింటాయన చెప్పాడు. అమృత్‌సర్‌లో చాలామందికి 'సింగ్' అన్నపేరు చివర్లో వుంటుందని కిరణ్‌కి తెలుసు.

కానీ వ్రాసి పోస్టుచేశాక అతడికి అనుమానం వచ్చింది. రోల్ నెం. 1 లో సింగే

వుంటాడని నమ్మకం ఏమిటి? తనలాగే ఏ కుమారో, రావో వుండొచ్చుగా.

మధ్యాహ్నానికల్లా కిరణ్ అనుమానం పెనుభూతమైంది. భోజనానికి ఇంటికొచ్చినపుడు కిడ్డీ బ్యాంక్‌లో ఎంత డబ్బుందో చూశాడు. పదిహేను రూపాయలు దాకా వుంది. పోస్టాఫీస్‌లో వందకార్డులు తీసుకున్నాడు మధ్యాహ్నమంతా ప్లేగ్రౌండ్‌లో కూర్చుని అదే వుత్తరాన్ని వంద కార్డులమీదా వ్రాశాడు. ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకూ క్లాసులు వ్రాసి, ఇష్టం వచ్చిన నెంబర్లు వేసి అన్నిటిమీదా సింగ్ అన్న పేరు వ్రాసి పోస్టు చేశాడు. అతడు అన్ని కార్డులు వ్రాయడానికి కారణం వుంది. ఫలానా రోల్ నెంబర్ సింగ్‌దే అయి వుత్తరం అందినా ఆ అబ్బాయి షాపువరకూ వెళ్ళి సింధూర్ కొనేటంత శ్రమ తీసుకుంటాడని నమ్మకం ఏమిటి? ఒక వేళ కొన్నా పంపటానికి పోస్టుఖర్చులుండొద్దూ? తనలాగే ఆ సింగ్‌కీ ఒక బామ్మ వుండాలి. అన్నిటికన్నా ముఖ్యంగా ముక్కూమొహం తెలియని తనకోసం కష్టపడేటంత జాలిగుండె వుండాలి కదా.

ఈ అనుమానాలతోనే కిరణ్ నాల్రోజులు బిక్కుబిక్కుమంటూ గడిపాడు. ఆదివారం దగ్గిరపడేకొద్దీ కిరణ్ గుండెలు భయంతో బరువెక్కసాగాయి. ఆరోజు మధ్యాహ్నం లెక్కలటీచర్ పాఠం చెపుతూండగా, పోస్టుమాన్ వచ్చి "కిరణ్‌కుమార్‌కి రిజిస్టర్డ్ కవర్" అన్నాడు. టీచర్‌తో సహా క్లాసులో అందరూ ఆశ్చర్యంగా చూస్తూండగా కిరణ్‌వెళ్ళి సంతకంచేసి తీసుకుని విప్పాడు. దాంట్లో చిన్న ప్లాస్టిక్ కవర్‌లో కుంకుమ, వుత్తరమూ వున్నాయి.

డియర్ కిరణ్ కుమార్,

నీ వుత్తరం అందింది. ఈరోజే వెళ్ళి నీవడిగిన సింధూర్‌ని పంపిస్తున్నాను. నీ వూరి పేరు నేను వినలేదు. ఆంధ్రప్రదేశ్‌కి దక్షిణంవైపు బంగాళాఖాతం పక్కన వుంటుంది కదూ. నీ దగ్గిర్నుంచి వుత్తరం రాగానే అమ్మకి చూపించాను. మా తాతగారు ఒకసారి మీవైపు వచ్చారట. మీరు మాలాగా గోధుమరొట్టెలు తినరటగా. ఈ ఉత్తరం అందగానే జవాబు వ్రాయి. నీ గురించి, నీ స్నేహితుల గురించి, మీ ప్రాంతం గురించీ వ్రాస్తావు కదూ. మీ రాష్ట్ర ముఖ్య పట్టణంహైద్రాబాదులో పెద్ద మ్యూజియం వుందటకదూ. మొన్నే మా టీచర్ చెప్పింది.

నీ స్నేహితుడు,

సంజయ్‌సింగ్.

కిరణ్ మొహం ఆనందంతో ఉప్పొంగినది. అప్పటివరకూ వున్న దిగులంతా ఎవరోతీసేసినట్టు ఒక్కసారి పోయింది. హుషారుగా ఆ పాకెట్ పట్టుకుని ఇంటికి వెళ్ళి, పక్కింటాయనకి ఇచ్చేశాడు. ఆ సాయంత్రమే సింగ్‌కి తన కృతజ్ఞతలు చెపుతూ ఉత్తరం వ్రాశాడు.

ఆ మరుసటిరోజు లెక్కల క్లాసు జరుగుతూండగా మళ్ళీ పోస్టుమాన్ వచ్చాడు. ఈసారి నాలుగు కవర్లు వచ్చినాయ్ - వేర్వేరు క్లాసుల నుంచి పంపారని. నాల్గింటిలోనూ కుంకుమ వుంది. కిరణ్‌కి ఈ ప్యాకెట్లు ఏం చేసుకోవాలో తెలియలేదు. నాల్గిటినీ కలిపి పూజగదిలో గప్‌చుప్‌గా మిగతా కుంకుమతో కలిపేశాడు.

ఆదివారం తండ్రివచ్చాడు. గుర్నామ్‌సింగ్ ఆయనకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు

చెప్పుకుంటూంటే, కిరణ్ పుస్తకంలో మొహం దాచుకుని సీరియస్‌గా వుండటానికి ప్రయత్నించాడు.

సోమవారం మధ్యాహ్నం మళ్ళీ పోస్టుమాన్ వచ్చాడు. ఈ సారి అతడి మొహంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనపడింది.

"డెబ్భై వుత్తరాలు" అన్నాడు.

"ఎన్నీ" నమ్మలేనట్లు అడిగాడు కిరణ్?

"డెబ్భై" పెద్ద కట్టతీశాడు పోస్టుమాన్. సంతకాలు పెట్టటానికే అరగంటపట్టింది. ఆ వుత్తరాలన్నీ ఇచ్చాక ఒక మామూలు కవరు కూడా ఇచ్చాడు. అందులో ప్యాకెట్ లేదు. వుత్తరం మాత్రమే వున్నట్టుంది.

అంతపెద్ద ఉత్తరాల కట్టతో లోపలికి వచ్చిన కిరణ్‌ని టీచర్ నిలదీసింది. అతడికి చెప్పక తప్పలేదు. గత మూడు రోజులుగా జరుగుతున్న వ్యవహారానికి వెనుక వున్న కారణమంతా భయంభయంగా చెప్పేశాడు. టీచర్ తన తండ్రిని పిలిపించి తను చేసిన మోసంగురించి చెప్తుందేమో అనుకుని భయపడ్డాడు.

అతడు చెప్పినదాన్ని క్లాసంతా ఆశ్చర్యంగా విన్నది. అంతా విని కవరు తెరవమంది. అందరూ తలో రెండూ కవర్లూ విప్పారు. ఎర్రటి కుంకుమ ప్యాకెట్లు టేబిల్‌మీద గుట్టగా పోశారు.

తరువాత అన్ని ఉత్తరాలూ చదవటం ప్రారంభించారు.

భారతదేశపు ఉత్తరకొసనుంచి దక్షిణాది రాష్ట్రానికి వంతెనకట్టినట్లున్నాయి ఆ వుత్తరాలు. చాలా మంది పిల్లలకి ఆంధ్రప్రదేశ్ వుందని తెలుసుకానీ, మిగతా వివరాలు అంతగా తెలియవు. దేశపు ఒక మూలనుంచి ఒకబ్బాయి ఇలా తమ కుంకుమకోసం వ్రాయడం వాళ్ళకి థ్రిల్‌గా అనిపించినట్టు ఆ వుత్తరాలే చెపుతున్నాయి. అందరూ ప్రత్యుత్తరాన్ని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. చాలా మంది తమ వూరు రమ్మని ఆహ్వానించారు కూడా. ఒక కుర్రవాడు వ్రాసిన ఉత్తరం గమ్మత్తుగా వుంది. ఆ కొట్లో కేవలం ఆఖరి ప్యాకెట్ మాత్రమే మిగిలిందనీ, గత మూడురోజులుగా అమ్మకాలు పెరిగి స్టాకు అయిపోయినట్టు కొట్టువాడు చెప్పాడనీ వ్రాశాడు. టీచర్ కుర్రవాళ్ళను తలో ప్యాకెట్టు ఇంటికి తీసుకువెళ్ళమంది. అలాగే ఆ అబ్బాయిలతో కలం స్నేహం చేసుకొమ్మని సలహా ఇచ్చింది. మన సంస్కృతి గురించీ, మన రాష్ట్రం గురించీ ఎలా వ్రాయాలో చెప్పింది. ఎన్నడూ లేనంత ఉత్సాహంగా ఆ రోజు క్లాసు జరిగింది. కిరణ్‌కయితే మనసు గాలిలో తేలిపోతున్నట్టు వుంది. పెద్ద అపాయం అనుకున్నది సంతోషంగా జరిగిపోయింది.

క్లాసయ్యాక బయటకొచ్చాడు. ఖాళీ కవర్లు బయట గాలిలో ఎగురుతున్నాయి. స్నేహానికి స్వాగతపత్రాల్లా వున్నాయవి. ఎల్లలు దాటి, సరిహద్దులు దాటి, జాతిమత అడ్డంకుల్ని దాటి ఒక కుర్రవాడి 'చిన్ని' సమస్యని ఎదుర్కోవటం కోసం వంద చిన్న చేతులు, దేశపు కొసల్ని దాకా ఈ చివర్నుంచి ఆ చివరకి పాకినట్టున్నాయి.

చప్పున కిరణ్‌కి జేబులోమిగిలిపోయిన చివరివుత్తరం గుర్తొచ్చింది.

దాన్ని విప్పి చదివాడు.

డియర్ కిరణ్ కుమార్;

నీ వుత్తరం అందింది. నేను మున్సిపల్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. నీ కోసం పవిత్రసింధూర్ కొందామని ఎంతో అనుకున్నాను కానీ మేము చాలా బీదవాళ్ళము. నాకు నలుగురు అక్కయ్యలు. నా తండ్రి వ్యవసాయం చేస్తూవుండగా నెలరోజుల క్రింత పొలంలో టెర్రరిస్టులు కాల్చేశారు. అమ్మ అప్పట్నుంచీ ఏడుస్తూనే వుంది. అక్కయ్యల దగ్గిరకూడా డబ్బులు వుండవు. తొందరలోనే నేను ఎలాగైనా నీకు సింధూర పంపుతాను.

ఇట్లు

భరత్‌సింగ్ సిద్ధూ.

❀ ❀ ❀

**(హారిక ప్రారంభ సంచిక - 1989)**